సాక్షి కామారెడ్డి

మంగళవారం । 27 । మే । 2025



పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



ప్రభుత్వ బడి కోసం..

పోచారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /23.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలి

కామారెడ్డి రూరల్: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. ఈ విషయమై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని పేర్కొన్నారు. అధీకృత లైసెన్స్ కలిగిన డీలర్ నుంచే విత్తనాలు కొనాలని సూచించారు. పంటకాలం ముగిసే వరకు బిల్‌ను భద్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. బిల్‌లో తప్పనిసరిగా విత్తన కంపెనీ పేరు, విత్తనం రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, ఖరీదు వివరాలు ఉన్నాయో లేవో చెక్ చేసుకోవాలని సూచించారు. ప్యాకెట్స్‌పై తప్పనిసరిగా తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ ఉండాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలపై 89777 46219 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల రెండో, నాలుగో సెమిస్టర్(రెగ్యులర్), ఒకటో, మూడో(బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. తెలంగాణ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి సంపత్ కుమార్ ఫలితాలను విడుదల చేశారు. ఐదుగురు విద్యార్థులు పది జీపీఏ, 50 మంది 9.5 జీపీఏ, 25 మంది 9 జీపీఏ సాధించారని ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణ అధికారి శాంతాబాయి, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు రాములు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



కామారెడ్డి అర్బన్: సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో వచ్చేనెల ఒకటో తేదీనుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అండర్-8, 10, 12 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే జిల్లా క్రీడాకారులను సోమవారం ఎంపిక చేశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 110 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కో విభాగంనుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారికి పతకాలు, ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ప్రతినిధులు నవీన్‌కుమార్, శివాగౌడ్, నరేష్, నరేష్‌రెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్, నవీన్, సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైంది వీరే..

శ్రీహన్, టి.శ్రేయాస్, కే.సాయి సిద్ధార్థ్, ఆర్.శ్రద్ధ,ఎ.సాయిశ్రేష్ట, సి.కార్తికేయ, ఎం.సుశాంక్, కే.కార్తికేయ, వి.మంజుల, బి.నిశిగ్నా, ఎం.శరణ్య, బి.స్నితిక, బి.సిద్ధు, బి.చైతన్య, పి.వరుణ్, ఎం.విహాన్‌రెడ్డి, పి.నిర్‌విల్, ఎం.భార్గవ్‌రెడ్డి, డి.సాత్విక, పి.పోచవ్వ, బి.స్నేహిత, డి.గీతం, బి.రితిక, ఎం.సాయిప్రియ.

ఇంట్లో నుంచి పారిపోయిన బాలుడు

- స్థానికుల సహకారంతో గుర్తించిన పోలీసులు

కామారెడ్డి క్రైం: అల్లరి చేస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి బయటకు పారిపోయాడు ఓ బాలుడు. స్థానికుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. ఓ చోట బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిల్లాలవారి కృష్ణమూర్తి కొడుకు విశ్వేశ్వర చారి (12) తల్లిదండ్రులు తిట్టారని ఇంట్లో నుంచి పారిపోయాడు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి ఎస్సై రాజు సిబ్బంది, స్థానికుల సహకారంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు నాలుగు గంటలపాటు గాలింపు చర్యలు చేపట్టి పట్టణంలో ఓచోట బాలుడి ఆచూకీ గుర్తించారు. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోయిల్ సాగర్ ముంపు బాధితులకు అప్పగించిన నిజాంసాగర్ భూమి



'సాగర్' భూములు అన్యాక్రాంతం

కబ్జాకు గురవుతున్న ప్రాజెక్టు భూములు

- పలు శాఖల కార్యాలయాలకూ కొంత కేటాయింపు
- ముంపు బాధితులకూ ఇక్కడే పునరావాసం
- ఆందోళనలకు సిద్ధమైన అఖిల పక్షం.. నేడు ధర్నాకు పిలుపు

శతాబ్దం క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. కానీ ప్రాజెక్టుకు సంబంధించిన భూములు మాత్రం తరిగిపోతున్నాయి. ప్రాజెక్టు భూములను పలువురు కబ్జా చేయగా.. కొంత భూమిని ప్రభుత్వమే కార్యాలయాలకు కేటాయించింది. ముంపు బాధితులకూ ఇక్కడే పునరావాసం కల్పించింది. ఇలా నిజాంసాగర్ భూములు తరిగిపోతుండడంతో వాటి పరిరక్షణకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. మంగళవారం ధర్నా చేయాలని అఖిలపక్ష నాయకులు నిర్ణయించారు.

నిజాంసాగర్ : కరువు కోరల్లో చిక్కిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సాగు, తాగు నీటిని అందించడం కోసం మంజీర నదిపై 1923–31 మధ్యకాలంలో జలాశయం నిర్మించారు. మూడు కిలోమీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో ఆనకట్ట కట్టారు. నిర్మాణ సమయంలో నీటి నిల్వ సామర్థ్యం 29.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టు సామర్థ్యం 17.80 టీఎంసీలకు తగ్గిపోయింది. వందేళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.

560 ఎకరాల భూమి..

నిజాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి పాలకులు 560 ఎకరాల భూములను అప్పగించారు. ఆ భూముల్లో నిజాంసాగర్ ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం గుల్‌దస్తా, సమ్మర్ బాగ్, గోల్ బంగ్లా, స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌస్‌ను కట్టించారు. అయితే నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న భూములు మాత్రం రోజురోజుకు కనుమరుగు అవుతున్నాయి. అచ్చంపేట శివారులో ఉన్న భూములను కొందరు వ్యక్తులు కబ్జా చేసుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. మరికొందరు వ్యక్తులు నీటిపారుదలశాఖ ఆధీనంలో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు భూముల్లో ఇళ్ల నిర్మాణాలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

ప్రభుత్వ కార్యాలయాలకు..

నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూములు ప్రభుత్వ కార్యాలయాలకు నిలయాలుగా మారాయి. 598 సర్వే నంబరులో పోలీస్ స్టేషన్‌కు 3 ఎకరాలు, వైర్‌లెస్ కార్యాలయం, ఆరోగ్య కేంద్రానికి 3.5 ఎకరాలు కేటాయించారు. తహసీల్ కార్యాలయానికి 5 గుంటలు, బస్ స్టేషన్‌కు 2.4 ఎకరాలు, ట్రాన్స్‌కో కార్యాలయానికి 0.25 ఎకరాలు, బృహత్ పల్లె ప్రకృతి వనానికి 10 ఎకరాలు, అటవీశాఖ ప్లాంటేషన్‌కు 6 ఎకరాలు, నిజాంసాగర్ పల్లె ప్రకృతి వనానికి 1.38 ఎకరాలు, ఎంపీడీవో కార్యాలయానికి 0.25 ఎకరాలు, జవహర్ నవోదయ విద్యాలయానికి 30 ఎకరాలు, మోడల్ పాఠశాలకు 10 ఎకరాలు, నీటిపారుదలశాఖ స్టోర్ రూమ్‌కు ఎకరం చొప్పున అప్పగించారు.

పరిరక్షణ కోసం పోరుబాట

వర్ని మండలం సిద్దాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ ముంపు బాధితులకు నిజాంసాగర్ ప్రాజెక్టు భూములు ఇవ్వాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అఖిల పక్షంగా ఏర్పాటయ్యారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూముల పరిరక్షణ కోసం పోరుబాటకు సిద్ధమవుతున్నారు. అఖిల పక్షం ఆధ్వర్యంలో మంగళవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో ధర్నా చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టు భూములను కాపాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కొయిల్‌సాగర్ బాధితులకూ..

మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి కూడా ఇక్కడే భూములు కేటాయించారు. కోయిల్ సాగర్ ముంపు బాధితుల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 8 ఎకరాల భూమిని అప్పగించారు. అలాగే అటవీ శాఖ నుంచి రోడ్లు వేయడంతో నిజాంసాగర్ నవోదయ సమీపంలో 5 ఎకరాల భూములను అప్పగించారు. ఇలా ఇష్టమొచ్చినట్లుగా ప్రభుత్వం ధారాదత్తం చేస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు భూములు తగ్గిపోతున్నాయి.



సిద్దాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు ఇవ్వాలనుకుంటున్న సాగర్ భూమి

ఆ కార్డులు రద్దయినట్లే!

అనుమానాస్పద రేషన్‌కార్డులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆరు నెలలుగా బియ్యం తీసుకోని వారి లెక్కలు తీసిన సర్కారు.. వాటిపై విచారణ చేపట్టింది. జిల్లాలో అధికారులు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించిన 1,620 కార్డులపై విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించే పనిలో ఉన్నట్లు తెలిసింది. ప్రక్రియ పూర్తయ్యాక జాబితాలోని చాలా రేషన్ కార్డులను తొలగించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

- జిల్లాలో 1,620 అనుమానాస్పద రేషన్ కార్డులు
- వాటిలో 2,669 మంది లబ్ధిదారులు
- పూర్తయిన విచారణ, త్వరలోనే తొలగించే అవకాశం



కామారెడ్డి క్రైం : వివిధ రకాల కారణాలతో అనుమానాస్పదంగా అనిపించిన రేషన్ కార్డులు, వాటిలో నమోదైన వ్యక్తుల జాబితాలను పక్షం క్రితం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపించింది. కొంత కాలంగా రేషన్ తీసుకోకపోవడం, రెండు చోట్ల కార్డు కలిగి ఉండడం, 18 ఏళ్లలోపు వయసున్న కార్డు యజమానులు, నకిలీ ఆధార్‌తో ఉన్న కార్డులు, చనిపోయి చాలా రోజులు గడుస్తున్నా జాబితాలోంచి తొలగించకపోవడం వంటి కారణాలతో వేలాది కార్డులను అనుమానాస్పద జాబితాలో చేర్చింది. వాటిలో కామారెడ్డి జిల్లాకు సంబంధించినవి 1,620 కార్డులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,669 మంది లబ్ధిదారులు ఉన్నారు. వాటిలో చనిపోయిన వారు, చాలా కాలంగా రేషన్ తీసుకోని వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు రేషన్ కార్డుల విషయంలో అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. కొన్ని కార్డుల్లో నకిలీ ఆధార్‌లు కూడా ఉన్నాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



అనుమానాస్పద రేషన్ కార్డుల జాబితా పక్షం రోజుల క్రితమే వచ్చింది. వాటిని సంబంధిత తహసీల్దార్‌లకు పంపించాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేశారు. ఆన్‌లైన్ ద్వారా నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం. తదుపరి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది.

– మల్లికార్జున్ బాబు, డీఎస్‌వో, కామారెడ్డి

నివేదికల తయారీ..

పక్షం రోజుల క్రితం వచ్చిన అనుమానాస్పద రేషన్‌కార్డుల జాబితాను పౌరసరఫరాల శాఖ అధికారులు తహసీల్దార్‌లకు పంపించారు. వారు క్షేత్రస్థాయిలో విచారణ జరిపించారు. విచారణ నివేదికలను సైతం చాలా మంది తహసీల్దార్‌లు ఇప్పటికే పౌరసరఫరాల శాఖకు సమర్పించినట్లు తెలిసింది. మరికొన్ని మండలాల నుంచి నివేదికలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. మండలాలవారీగా వచ్చిన నివేదికలను రాష్ట్రానికి, అక్కడ నుంచి కేంద్రానికి పంపుతారు. ఆ తర్వాత అనర్హులుగా గుర్తించిన కార్డులను గానీ, కార్డులోని సభ్యులను గానీ తొలగించే అవకాశాలు ఉంటాయి. ప్రక్రియ మెత్తం ప్రభుత్వ వెబ్‌సైట్‌లోని లాగిన్‌లో పూర్తి చేస్తున్నారు. అనుమానాస్పద జాబితాలో వచ్చిన చాలా కార్డులను తొలగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నివేదికలు ప్రభుత్వానికి చేరిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

కొనసాగుతున్న పరీక్షలు

కామారెడ్డి అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. సోమవారం మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకానమిక్స్ పరీక్షలకు 2,730 మంది హాజరవ్వాల్సి ఉండగా 126 మంది గైర్హాజరయ్యారన్నారు. వొకేషనల్ పరీక్షకు 421 మందికిగాను 15 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సెకండర్ ఇయర్ పరీక్షల్లో 1,262 మందికి 69 మంది పరీక్ష రాయలేదని పేర్కొన్నారు.

ఇందూరు అక్షరలక్ష్మి అభినందనీయం

- రాష్ట్రంలోనే తొలిసారి యాప్ రూపకల్పన
- ఆవిష్కరించిన నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల విద్యార్హతలను గుర్తించడంతోపాటు నిరక్షరాస్యులకు చదవడం, రాయడం నేర్పించాలనే సంకల్పంతో 'ఇందూరు అక్షరలక్ష్మి' యాప్ రూపొందించడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా, అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, సమగ్ర శిక్ష, వయోజన విద్యా శాఖల ఆధ్వర్యంలో 'ఇందూరు అక్షరలక్ష్మి' పేరుతో రూపొందించిన యాప్‌ను ఐడీవోసీ కార్యాలయ కాన్ఫరెన్స్‌హాల్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సు మారు 3.40 లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారన్నారు. సీసీలు, వీవోఏల సహాయంతో వారి విద్యా సంబంధిత వివరాలను సేకరించి ఇందూరు అక్షరలక్ష్మి యాప్‌లో నమోదు చేస్తామన్నారు. అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, పదో తరగతిలోపు చదువుకున్న వారితో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు, ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన వారితో ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయిస్తామని తెలిపారు. గణాంకాల ప్రకారం జిల్లాలో మహిళల అక్షరాస్యత 55 శాతంగా ఉందని, సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం అమలు ద్వారా నూటికి నూరు శాతం మహిళా అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ సూచించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయాగౌడ్, ఏపీడీ రవీందర్, డీఈవో అశోక్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, వయోజన విద్యా సంయుక్త సంచాలకులు గోవింద్‌రావు, స్వయం సహాయక మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న జొన్న కొనుగోళ్లు

బాన్సువాడ రూరల్: జిల్లాలో జొన్న కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. మంగళవారంతో కొనుగోలు కేంద్రాలను మూసి వేయాలని మార్క్‌ఫెడ్ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో 71,223 ఎకరాల్లో జొన్న పంట సాగయ్యింది. పెట్టుబడి, కూలీల ఖర్చులు తక్కువ కావడం, జొన్నలకు డిమాండ్ పెరుగుతుండడంతో మంచి ఆదాయం వస్తుందన్న ఆశతో ఈ పంట వేశారు. అడవి పందుల బెడదను తట్టుకునేందుకు పలువురు రైతులు పొలాల వద్ద సోలార్ రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు. పంటను సేకరించేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల ద్వారా క్వింటాలుకు రూ. 3,371 మద్దతు ధర చెల్లించి రైతులనుంచి జొన్నలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 11,275 వేల మంది రైతుల నుంచి సుమారు 29,215 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో దళారులను ఆశ్రయించే బాధ తప్పిందని కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జొన్న కొనుగోళ్లు చివరి దశకు చేరడంతో జిల్లాలో సుమారు నెలన్నర క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. బుధవారం నుంచి కొనుగోలు కేంద్రాలను మూసివేయనున్నారు.



కోనాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో జొన్నలను చూపుతున్న రైతులు

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో ఏర్పాటు చేసిన 24 జొన్న కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే నాలుగింటిలో కొనుగోళ్లు పూర్తయ్యాయి. వాటిని మూసి వేశాం. మిగిలినవాటిని 28 నుంచి మూసివేస్తాం. ఇంకా ఎవరి వద్దనయినా జొన్నలు మిగిలి ఉంటే మిగిలి ఉన్న ఒక్క రోజును సద్వినియోగం చేసుకోవాలి. – మహేష్‌కుమార్, డీఎం, మార్క్‌ఫెడ్

ప్రతి అంశంపై పట్టు సాధించాలి

కామారెడ్డి క్రైం : లైసెన్స్‌డ్ సర్వేయర్‌లు శిక్షణలోని ప్రతి అంశంపై పూర్తి అవగాహన సాధించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపికైన వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమిస్తోందని పేర్కొన్నారు. మొదటి విడతలో 131 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. రోజూ ఉదయం థియరీ, మధ్యాహ్నం నుంచి ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. భూములకు సంబంధించిన కొలతలు, మ్యాప్‌లు ప్రభుత్వపరంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష ఉంటుందని తెలిపారు. అనంతరం శిక్షణ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ సర్వేయర్లు పాల్గొన్నారు.



శిక్షణ మెటీరియల్‌ను అందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: బ్యాంకర్లతో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్క్ అవుట్ త్వరగా ఇవ్వాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను తొందరగా పూర్తిచేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష్యానికి అనుగుణంగా ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇంకుడు గుంతలు, ఫాామ్ పాండ్స్ నిర్మాణాలను చేపట్టాలని సూచించారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ తనిఖీ

ఎల్లారెడ్డి : పట్టణంలోని సివిల్ సప్లై గోదాం ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ శేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. గోదాంకు వచ్చిన బియ్యాన్ని జగిత్యాలకు తిరిగి పంపడంపై విచారణ నిర్వహించారు. జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగం సురేందర్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు అక్టోబర్‌లో జగిత్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ముక్కిపోయిన బియ్యం వచ్చాయన్నారు. వీటిని డీలర్లు ప్రజలకు పంపిణీ చేయగా వారు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గోదాంకు రిటర్న్ చేశారన్నారు. ముక్కిపోయిన బియ్యం సరఫరా చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులను కోరారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏఎస్‌వో సుదర్శన్‌రెడ్డి, గోదాం ఇన్‌చార్జి బాలయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు, రేషన్ డీలర్లు ప్రభాకర్, నర్సింలు, శ్రీనివాస్, శ్రీరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాంలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

క్లుప్తంగా

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


సముందర్ తండాలో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని సముందర్ తండాలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో చిన్నపిల్లలకు అందేవిధంగా ఉందని తండావాసులు ఆరోపించారు. కనీసం చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తును పెంచి, దాని చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పెళ్లి కావడం లేదని ఆత్మహత్యాయత్నం

రామారెడ్డి: పెళ్లి కావడం లేదని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన రామారెడ్డి మండలం స్కూల్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మోతీలాల్ అనే యువకుడు తండ్రి దేవ్‌సింగ్‌తో కలిసి వ్యవసాయం చేసే వాడు. ఎన్ని సంబంధాలు చూసిన పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు మోతీలాల్‌ను ఆస్పత్రికి తరలించారు.

చుట్టాకు వాహనం స్వాధీనం



లింగంపేట(ఎల్లారెడ్డి): అక్రమంగా చుట్టాకును తరలిస్తున్న వాహనా న్ని సోమవా రం అటవీ శాఖ బీట్ అధి కారి సంధీస్ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నాపూర్ గ్రామంలో చుట్టాకును సేకరించి మెదక్‌కు తరలిస్తుండగా పొల్కంపేట శివారులో అడ్డగించి పట్టుకున్నా మన్నారు. వాహనంలో సుమారు రూ. 60 వేల విలువ చేసే చుట్టాకు ఉన్నట్లు తెలిపారు. వాహన డ్రైవర్ స్వామిని పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

దుబాయ్‌లో యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

రామారెడ్డి: మండలంలోని గోకుల్ తండాకు చెందిన మాలోత్ భాస్కర్(26) అనే యువకుడు దుబాయ్‌లో అనారోగ్యంతో మరణించినట్లు స్నేహితుల ద్వారా తెలిసింది. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులతో ఉపాధి కోసం గత పది నెలల క్రితం భాస్కర్ దుబాయ్ వెళ్లాడు. నాలుగు రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కొడుకు మృతి వార్త విన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

బాన్సువాడ ఆస్పత్రి తనిఖీ



బాన్సువాడ: పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని సోమవారం కాయకల్ప బృందం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఆయా వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీఎస్ఎస్ రఘు, సీనియర్ టెక్నికల్ మేనేజర్ ఐసీహెచ్‌హెచ్ఏ మేహెర్ వాణీ, ఎస్-క్యూ ఏ వినయ్‌పాల్‌సింగ్, నర్స్ సాయి శీల తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 86 ఫిర్యాదులు


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రం శివారులోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 86 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్లకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 409 ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ రేఖ, ఐకేపీ ఏపీవో రాజు, ఈజీఎస్ ఏపీఎం రజని, ఏవో మణిదీపిక తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఉపాధికి గండి కొడుతున్నారు..

జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కొంతమంది అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత వాహనాలను ప్రభుత్వ విధులకు నడిపిస్తూ నిరుద్యోగుల ఉపాధికి గండి కొడుతున్నారని హైర్ వెహికల్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు రాజాగౌడ్ మాట్లాడుతూ.. 48 ప్రభుత్వ శాఖల్లో ఒక్కోశాఖకు కనీసం 5 అద్దె వాహనాలు అవసరం ఉంటాయన్నారు. వాటిని నిరుద్యోగులైన వాహనదారుల నుంచి అద్దెకు తీసుకుని నడిపించుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ అధికారులు తమ సొంత వాహనాలను నడిపిస్తూ అడ్డదారిలో బిల్లులు చేయించుకుంటున్నారన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం నడిపిస్తున్న అద్దె వాహనాలకు సంబంధించిన 15 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.


కలెక్టరేట్‌కు తరలివచ్చిన హైర్ వెహికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలి..

భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలో గతంలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో నివాసాలు వేసుకున్న వారికి విద్యుత్, మంచినీటి సౌకర్యాలను కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిందన్నారు. ఆ స్థలాలను కాజేయాలనే ఉద్దేశంతో కొందరు అధికారులను బెదిరిస్తూ కాలనీకి మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు రాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీకి తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు దేవరాజ్, నర్సింలు, నారాయణ, లక్ష్మీ, రమణ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగంపల్లి వాసులు

ప్రభుత్వ బడికి ప్రహరీ నిర్మించండి


పోచారంలో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ పునర్నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..జాతీయ రహదారి ఏర్పాటు పనుల్లో భాగంగా ఇటీవల గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ ద్వారా వరదనీరు రావడంతోతో పాఠశాల ప్రహరీ కూలిపోయిందన్నారు. అలాగే పాఠశాల ఆవరణలోకి వరదనీరు చేరి చెరువులా మారిందన్నారు. వెంటనే హైవే పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పాఠశాల ప్రహరీని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో,కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందితో మాట్లాడారు. పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిని జేసీబీ సహాయంతో సంస్థ సిబ్బంది తొలగింపజేశారు. ప్రహరీ నిర్మాణ విషయం తన పరిధిలో లేదని సంస్థ సిబ్బంది స్పష్టం చేశారు. దీంతో గ్రామస్తులు ప్రహరీ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

తాడ్వాయిలో..


ప్రహరీ లేని హరిజనవాడ పాఠశాల ఆవరణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడలోగల ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ పూర్తిగా లేకపోవడంతో పశువులు, విష పురుగులు బడి ఆవరణలో సంచరిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంటగది కూడా లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి పాఠశాలలు ప్రారంభం కాకాముందే బడికి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పోచారం కాలనీ



పోచారం కాలనీలో మురికికాలువ దుస్థితి.. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని పోచారం కాలనీ అధ్వానంగా మారింది. కాలనీలోని డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే రోడ్ల పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సుల ఫిట్‌నెస్ బాధ్యత స్కూల్ యాజమాన్యాలదే

- రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

ఖలీల్‌వాడి: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని, బస్సుల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. నాగారంలోని జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాజమాన్యాలు బస్సులను సరిగా పట్టించుకోకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొత్తగా వచ్చిన డ్రైవర్లకు రూట్లు తెలియకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. పీపీ–1 నుంచి ఆరో తరగతి వరకు చదివే పిల్లలు స్కూల్‌కు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు తల్లిదండ్రులు లేదా కుటుంబసభ్యులు బస్సుల వద్ద వేచి ఉండి తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ పరిమళ, డీటీవో ఉమామహేశ్వర్‌రావు, రోడ్డు రవాణా సభ్యులు రాజరాజనరేందర్, ఎంవీఐలు వివేకానందరెడ్డి, కిరణ్, రాహుల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అపార్ట్‌మెంట్లో అగ్ని ప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లోని జేఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి.వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా వచ్చి మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని, సెల్లార్‌లో మంటలు చెలరేగడంతో ఆర్పివేసినట్లు ఫైర్ ఆఫీసర్ శంకర్ తెలిపారు.

కూలిన చారిత్రక కట్టడం


కుద్వాన్‌పూర్‌లోని ఏడంతస్తుల భవనం(ఫైల్)


కూలిన ఏడంతస్తుల భవన శకలాలు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు చారిత్రక కట్టడమైన ఏడంతస్తుల భవనం కూలిపోయింది. ఆదివారం రాత్రి 10.30 గంటలకు పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు వెళ్లి చూడగా భవనం కుప్పకూలింది. ఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు, కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. తమకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన భవనం కూలిపోవడం బాధగా ఉందని ఉత్తూర్ లచ్చయ్య మనుమడు పాలకుర్తి శ్రీనివాస్ ఆవేదనను వ్యక్తం చేశాడు.

1942లో నిర్మాణం..

కుద్వాన్‌పూర్ నిజాం కాలంలో ఆస్థానంగా ఉండేది. గ్రామానికి చెందిన ఉత్తూర్ లచ్చయ్య వృత్తి రీత్యా ప్రజలకు వైద్యం చేసేవాడు. కాగా, తనకు ఉండే భవనం మరెవరికీ ఉండొద్దని ఉద్దేశంతో 1942 సంవత్సరంలో ఏడంతస్తులు నిర్మించాడు. అప్పట్లోనే హైదరాబాద్ సంస్థానం నుంచి అనుమతి పొందినట్లు సమాచారం. సొంతంగా కట్టడం ప్లాన్ చేసుకొని, దంగు సున్నాన్ని ఎడ్లతో తొక్కించి సిమెంట్‌లా తయారు చేసి ఇంటిని నిర్మించినట్లు కుటుంబీకులు తెలిపారు. జిల్లాలో ఏడంతస్తుల భవనం ఎక్కడా లేకపోవడంతో అప్పట్లో ఈ భవనాన్ని చూసేందుకు తరలివచ్చేవారని చెపుతారు. కాలక్రమేనా లచ్చయ్య ఇష్టంతో కట్టుకున్న ఈ భవనాన్ని కూతురు ప్రభావతికి ఇచ్చిన కొన్ని రోజులకు కన్నుమూశాడు. కాగా, ప్రభావతి తన కుటుంబంతో ఇదే భవంతిలో నివాసం ఉండేది. కుమారులు ఇతర ప్రాంతాలకు వెళ్లగా గత పది సంవత్సరాల నుంచి ఈ భవనాన్ని అద్దెకు ఇచ్చారు. నెల రోజుల క్రితం వరకు ఈ భవనంలో జనాలు నివసించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఏపీఆర్ఏసీఏ సమావేశంలో డీసీసీబీ చైర్మన్

సుభాష్‌నగర్: ఇండోనేషియా దేశంలోని బాలిలో సోమవారం ప్రారంభమైన 78వ ఆసియా పసిఫిక్ రూరల్ అగ్రికల్చరల్ క్రెడిట్ అసోసియేషన్ (ఏపీఆర్ఏసీఏ) సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పాల్గొన్నారు. మొదటిరోజు సమావేశంలో సహకార రంగ అభివృద్ధిపై చర్చించారని, మూడు రోజులపాటు సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు. తెలంగాణలో డీసీసీబీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, పనితీరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, ఉద్యోగులు, పాలకవర్గం, తదితర అంశాలపై రమేశ్‌రెడ్డి సమావేశంలో వివరించారు. ఈ సమావేశానికి భారత్ తరఫున 10 మంది ప్రతినిధులు పాల్గొనగా, అందులో తెలంగాణ నుంచి ఐదుగురు ఉన్నారు.

పూర్వ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఆర్మూర్‌టౌన్: డిగ్రీ పూర్తి చేసి 25 సంవత్సరాల్లోపు గురుకుల పూర్వ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్, గురుకుల సొసైటీ సంయుక్తంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో స్పోకెన్ ఇంగ్లిష్, జీవిత నైపుణ్యాలు, మానవీయ విలువలు, కంప్యూటర్ పరిజ్ఞానం, వృత్తి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30లోపు ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి


మహ్మద్ అజీజ్ (ఫైల్)

లింగంపేట (ఎల్లారెడ్డి): విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ అజీజ్(33) నాలుగు సంవత్సరాలుగా లింగంపేటలో వెల్డింగ్ షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య అమ్రిన్ బేగం, కూతురు మదియా ఫాతిమా, కుమారులు మహ్మద్ అజాన్, మహ్మద్ దయాన్ ఉన్నారు.

గురుకుల అవుట్‌సోర్సింగ్ వాచ్‌మన్..


లింగం (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్ర సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం కరెంట్ షాక్‌తో అవుట్‌సోర్సింగ్ వాచ్‌మన్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల కళాశాలలో జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సొసైటీ ఉన్నతాధికారులు తరగతి గదులు, పరిసరాలు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో అవుట్ సోర్సింగ్ వాచ్‌మన్లు దోమకొండ లింగం(35), భాస్కర్, ఎలక్ట్రిషియన్ ఆరోజ్ ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు సిద్ధమయ్యారు. లింగం, ఆరోజ్ ట్యాంక్‌పైకి ఎక్కగా భాస్కర్ కింద ఉన్నాడు. ట్యాంక్‌లోకి దిగేందుకు నిచ్చెన అవసరం ఉండడంతో భాస్కర్ ఇనుపనిచ్చెనను ట్యాంక్‌పైన ఉన్న లింగంకు అందించాడు. లింగం నిచ్చెనను పైకిలేపగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరోజ్ తలకు తీవ్రగాయం కాగా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకొని లింగం మృతదేహాన్ని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఆర్డీవో వీణ, డిప్యూటీ తహసీల్దార్ శృతి, ఆర్ఐ బాలయ్య సందర్శించారు.

తల్లిగారింటికి వస్తూ అనంతలోకాలు..


సులోచన (ఫైల్)

మాచారెడ్డి : తల్లిగారింటికి వస్తున్న ఓ గృహిణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఐదు నిమిషాల్లో ఇళ్లు చేరుతుందనగా మృత్యువు కబలించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాజన్నపేట గ్రామానికి చెందిన సులోచన (36) సోమవారం ఇద్దరు కుమారులు అన్వేష్, శివాన్స్‌లతో కలిసి బస్సులో వచ్చి మాచారెడ్డి చౌరస్తాలో దిగింది. తండ్రి నారాయణకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. దీంతో నారాయణ తన టీవీఎస్ మోపెడ్‌పై ఇద్దరు మనుమలు, కూతురు సులోచనను తీసుకొని లచ్చాపేట గ్రామానికి వెళుతుండగా స్టేజీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన బైకు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన సులోచనను కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి నారాయణ, ఇద్దరు కుమారులు చికిత్స పొందుతున్నారు. కాగా, సులోచన భర్త మహేందర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

నందిపేట్ (ఆర్మూర్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన నిర్మల్ జిల్లాకు చెందిన జాదవ్ సుందాబాయి(70) చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కుంటాల మండలం దౌనెల్లి తాండకు చెందిన రాథోడ్ సంతోష్ తల్లి రాథోడ్ యమునాబాయి ఆరోగ్యం బాగోలేదని అత్తమ్మ జాదవ్ సుందబాయితో కలిసి సోమవారం ఆర్మూర్ మండలం ఆలూరు గ్రామానికి డాక్టర్ వద్దకు ఆటోలో వస్తున్నారు. నందిపేట మండలం వెల్మల్ గ్రామ సమీపంలో ఎదురుగా బైక్ పై అతివేగంగా వచ్చిన పెద్ద అంజన్న ఆటోని ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలుకావడంతో నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ జాదవ్ సుందబాయి మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

రామాయంపేట్‌లో రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- ఖిల్లా డిచ్‌పల్లిలో విషాదం


నిఖిల్ (ఫైల్)

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): వారిద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే చదువుకున్నారు. బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరారు. వారాంతపు సెలవుల్లో కలిసే గ్రామానికి వచ్చి రెండు రోజులపాటు కుటుంబసభ్యులు, మిత్రులతో సంతోషంగా గడిపి తిరిగి ఉద్యోగానికి వెళుతుంటారు. అలాంటిది సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం వారి జీవితంతోపాటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదంలో ఒక యువకుడు అక్కకడికక్కడే మృతి చెందగా మరో యువకుడు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన బూస లింబాద్రి, లక్ష్మి దంపతులు కొడుకు నిఖిల్ (24), మల్లాపురం నర్సయ్య, సునీత దంపతుల కొడుకు నితీశ్ మంచి స్నేహితులు. ప్రస్తుతం హైదరాబాద్ మాదాపూర్‌లోని అర్కబ్రాంకమ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. శని, ఆదివారం వీకెండ్ సెలవుల్లో భాగంగా గ్రామానికి వచ్చారు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు ఇద్దరూ కలిసి మోటార్ బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మెదక్ జిల్లా రామాయంపేట బైపాస్ క్రాసింగ్ వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై వీరి బైక్‌ను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నిఖిల్ అక్కడిక్కకడే మృతి చెందగా నితీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకొని రామాయంపేట్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు నితీశ్‌ను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నితీశ్ పరిస్థితి విషమంగా ఉంది. అందరితో కలిసి మెలిసి ఉండే నిఖిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం, నితీశ్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరడంతో ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. సాయంత్రానికి గ్రామానికి చేరుకున్న నిఖిల్ మృతదేహానికి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, గ్రామస్తులు కన్నీళ్లతో అంత్యక్రియలు నిర్వహించారు.

తండ్రి హత్య కేసులో కొడుకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్

లింగంపేట(ఎల్లారెడ్డి): తండ్రిని హత్య చేసిన కొడుకును రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ ఫకీరా భార్య, పిల్లలు ఉండగా రెండో వివాహం చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఫకీరా ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలుపగా వారు నిరాకరించారు. తండ్రి రెండో పెళ్లి చేసుకోవడం ఇష్టంలేని కొడుకు దేవసోత్ ప్రకాశ్.. ఫకీరాను గొడ్డలితో నరికి చంపినట్లు తెలిపారు. ఫకీరా సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ప్రొహిబిషన్ ఎస్సై రాఘవేంద్ర, ఏఎస్సై ప్రకాశ్ నాయక్, సిబ్బంది మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన 36 మందిని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. 31 మందికి రూ.59వేల జరిమానా విధించగా, ఒకరికి ఒకరోజు, నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

పది మందికి రెండు రోజులు..

ఆర్మూర్ టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా పదిమందికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ తీర్పునిచ్చినట్లు తెలిపారు. పేర్కొన్నారు.

అర్ధరాత్రి వరకు షాపు తెరిచిన ముగ్గురికి..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వరకు షాపులు తెరిచిన ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వీక్లీ మార్కెట్‌లో చింతకాయల రాజేందర్, బోధన్ రోడ్డులో గుండె రాజు, మాలపల్లి ఫ్రూట్ మార్కెట్‌లో షేక్ అర్బాజ్‌లను స్పెషల్ సెకండ్‌క్లాస్ జడ్జి ఎదుట హాజరుపరచగా ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరికి..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ మీసేవ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా విధులకు ఆటంకం కలిగించిన చిలం గౌతంరెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం గౌతంరెడ్డి మద్యం సేవించి వాహనాన్ని అతివేగంగా నడుపుతూ రాగా ట్రాఫిక్ పోలీసులు ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తుండగా దాడి చేసి విధులకు ఆటంకపరిచాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.